ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 కర్ణాటక వార్తలు
శనివారం 9 మార్చి 2024

సీఈటీ దరఖాస్తుకు 15 వరకు గడువు

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ తదితర వృత్తి విద్యాకోర్సుల్లో ప్రవేశానికి గాను కర్ణాటక పరీక్షా ప్రాధికార నిర్వహించనున్న సీఈటీ (కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) పరీక్షలకు దరఖాస్తులను ఈ నెల 12 నుంచి 15 వరకు సమర్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రాధికార నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఫీజు చెల్లించేందుకు మార్చి 16 సాయంత్రం 5.30 వరకు సమయం ఉంటుందని ప్రకటన పేర్కొంది. అసంపూర్ణంగా ఉన్న దరఖాస్తులను సరిచేసుకునేందుకు కూడా మరో అవకాశం ఇస్తున్నామని తెలిపింది.

శంభోశంకర..
హరహర మహాదేవ

- కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- శివరాత్రి జాగరణ కోసం సాంస్కృతిక సందడి


బెంగళూరులోని శివోహం ఆలయం వద్ద భక్తుల సందడి


రాయన్ సర్కిల్‌లోని అరుణాచలేశ్వర ఆలయంలో అభిషేకం


ధర్మస్థళ ఆలయం వద్ద భక్తుల రద్దీ


కాడు మల్లేశ్వర ఆలయంలో విశేష అలంకరణ


యశ్వంతపురలోని గాయత్రి దేవస్థానంలో శివలింగాలకు పూజలు


బాపూజీనగర్ శివాలయం

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఎటు చూసినా శంభోశంకర అంటూ భక్తులు పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం శివరాత్రి పూజలు తెల్లవారుజాము నుంచే ప్రారంభమయ్యాయి. బెంగళూరులోని గవి గంగాధరేశ్వర, కాడు మల్లేశ్వర, శివోహంతోపాటు వందలాది ఆలయాలలో భక్తులు క్యూ కట్టి దర్శనం చేసుకున్నారు. గవిగంగాధరేశ్వర ఆలయ జాతర వైభవంగా సాగింది. చామరాజనగర జిల్లాలోని మలె మహదేశ్వర ఆలయానికి సమీప రాష్ట్రాలకు చెందిన భక్తులు తరలిరావడంతో కొండపై కిటకిటలాడింది. ధర్మస్థళ మంజునాథస్వామి, మురుడేశ్వర, గోకర్ణలోని మహాబలేశ్వర ఆలయాల్లోనూ, నంజనగూడు శ్రీకంఠేశ్వర ఆలయాల్లో వేలాదిమంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. శివరాత్రి పర్వదినాన ఉపవాసదీక్షలు చేసి దేవుడిని కొలవడం ఆచారంగా వస్తోంది. శివరాత్రి జాగరణ చేసే భక్తుల కోసం బెంగళూరు వ్యాప్తంగా 150కి పైగా ప్రాంతాల్లో సంగీతం, భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రతిచోటా రుద్ర హోమాలు నిర్వహించారు. ఉత్తరకర్ణాటక వ్యాప్తంగా శివరాత్రి కోసం ఇంటింటా లింగపూజలు ఆచరించారు. పలు చోట్ల గిరిజా కల్యాణం నిర్వహించగా దాదాపు అన్ని శివాలయాల్లో యామపూజలు కొనసాగాయి.




చామరాజపేటలోని కాశీవిశ్వనాథేశ్వరుడికి అలంకరణ


రామేశ్వరం ఆలయంలో క్షీరాభిషేకం


మురుడేశ్వరుడి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు


పూజల్లో పాల్గొన్న భక్తులు

అద్భుత సేవలతో అత్యున్నత శిఖరాలు

- నిరాడంబరానికి పెట్టింది పేరు
- ప్రచార ఆర్భాటాలకు దూరం
- రాష్ట్రం నుంచి రాజ్యసభకు 'ఇన్ఫోసిస్' సుధామూర్తి



బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రచనా వ్యాసంగం అంటే మహాఇష్టం. ఆధ్యాత్మిక సేవలంటే మక్కువ. సామాజిక సేవల గురించి చెప్పాల్సిన పనేలేదు. నిరాడంబరతకు పెట్టింది పేరు. ప్రచార ఆర్భాటాలకు బహుదూరం. వెరసి ఆమె పేరు డాక్టర్ సుధామూర్తి. ఈ అపురూప సేవలే ఆమెను అత్యున్నత శిఖరాలకు చేర్చాయి. కేంద్రప్రభుత్వ సిఫారసు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం డాక్టర్ సుధామూర్తిని రాజ్యసభకు నామినేట్ చేసిన విషయం ప్రధాని నరేంద్రమోదీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసిన తక్షణం అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. అత్యంత సమర్థురాలైన ఒక మహిళా నేతకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజే అత్యున్నత హోదా దక్కడం, ఆమె పార్లమెంటులోని పెద్దలసభలోకి అడుగిడబోతుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రపంచంలోని ప్రముఖ ఐటీ కంపెనీలలో ఒకటైన ఇన్ఫోసిస్ సంస్థాపకుడు నారాయణమూర్తి సతీమణిగా ఆమె తన సామాజిక సేవలతో మంచి గుర్తింపు పొందారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలిగా ఆమె చేసిన సేవలు అజరామరం. 1950 ఆగస్టు 19న (ఉమ్మడి ధారవాడ జిల్లా) హావేరి జిల్లాలోని శిగ్గావిలో డాక్టర్ ఆర్‌హెచ్ కులకర్ణి, విమలా కులకర్ణి దంపతులకు జన్మించారు. సుధామూర్తి హుబ్బళ్లిలోని కేఎల్‌ఈ సంస్థకు చెందిన ఇంజనీరింగ్ కళాశాలలో డిగ్రీ చేశారు. అనంతరం ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. అనంతరం సుధామూర్తి టాటా ఇంజనీరింగ్ లోకోమోటివ్ (టెల్కో)లో తన కెరీర్‌ను ప్రారంభించారు. భారతదేశంలో అతిపెద్ద వాహనాల తయారీ సంస్థలో తొలి మహిళా ఇంజనీర్‌గా ఆమె సత్తా చాటుకున్నారు. 1970 ఫిబ్రవరి 10న ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తిని వివాహమాడారు. ఇన్ఫోసిస్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేదిశలో భర్తతో కలసి అడుగులు వేశారు. 1996లో చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి వరదపీడిత బాధితుల కోసం రాష్ట్రంలో 2,300కుపైగా ఇళ్లను నిర్మించారు. విద్యాసంస్థలో 70వేలకు పైగా గ్రంథాలయాలను, 16వేలకు పైగా పబ్లిక్ టాయ్‌లెట్‌లను నిర్మించారు. ఈమె సేవలను గుర్తించిన కేంద్రం 2006లో అత్యున్నత 'పద్మశ్రీ' పురస్కారాన్ని, 2023లో 'పద్మ భూషణ్' పురస్కారాన్ని అందజేసి గౌరవించింది.

సుధామూర్తి సేవలను గుర్తించిన ఏపీ ప్రభుత్వం గతంలో టీటీడీ బోర్డు పాలకమండలి సభ్యురాలిగా నియమించిన సంగతి విదితమే. ప్రస్తుతం థాయ్‌లాండ్ పర్యటనలో ఉన్న ఆమె తనను రాజ్యసభకు నామినేట్ చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. దేశానికి సేవ చేసే భాగ్యం దక్కడం సంతోషంగా ఉందన్నారు. సుధామూర్తిని ముఖ్యమంత్రి సిద్దరామయ్యతోపాటు పలువురు ప్రముఖులు అభినందించారు.

బీజేపీ హర్షం

సమాజసేవకు తనను తాను అంకితం చేసుకున్న డాక్టర్ సుధామూర్తిని కేంద్రం రాజ్యసభకు నామినేట్ చేయడాన్ని బీజేపీ స్వాగతించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడే ప్రధాని మోదీ ఒక అద్భుతమైన కానుకను రాష్ట్ర ప్రజలకు ఇచ్చారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా ఆమె చేస్తున్న సేవలు ఎంతగా ప్రశంసించినా తక్కువే అన్నారు. డాక్టర్ సుధామూర్తి లాంటి నారీశక్తిని గుర్తించిన ప్రధాని నరేంద్రమోదీకి బీజేపీ శ్రేణులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాయి.

రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ

- రూ.17,836 కోట్లకు స్టేట్ హైలెవెల్ కమిటీ ఆమోదం
- 27వేల మందికి ఉద్యోగ అవకాశాలు : సీఎం


హైలెవెల్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య తదితరులు

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన అధికార నివాసం కృష్ణలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి 63వ హైలెవెల్ కమిటీ సమావేశంలో రూ.17,836 కోట్ల మేర పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. తద్వారా 27,067 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్రస్థాయి హైలెవెల్ కమిటీ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ విజయపుర, కలబురగి, బళ్లారి, బెళగావి జిల్లాల్లో రూ.10,433.72 కోట్ల మేరకు పెట్టుబడులతో పలు కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. కమిటీ ఆమోదం తెలిపిన వాటిలో రూ.8,220.05 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 6 ప్రాజెక్టులు కొత్తవని, రూ.9,615.81 కోట్లకు సంబంధించిన పెట్టుబడులు 8 ప్రాజెక్టుల విస్తరణ కార్యక్రమాల్లో భాగమన్నారు. ఈ పెట్టుబడులతో ఉత్తరకర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక విప్లవం చోటు చేసుకోనుందన్నారు. ఈ సమావేశంలో భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంటీ పాటిల్, ఐటీ బీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రజనీశ్ గోయెల్ తదితరులు పాల్గొన్నారు.


పెట్టుబడుల వివరాలు..

ఎస్‌టీటీ గ్లోబల్ డాటా సెంటర్స్ ఇండియా బెంగళూరు గ్రామీణ జిల్లా దేవనహళ్లి పరిశ్రామికవాడలోనూ, లిస్టాన్ ఇన్ఫోకామ్ మాన్యుఫాక్చరింగ్ ఇండియా, కోలారు జిల్లా నరసాపుర పారిశ్రామికవాడలోనూ, ఇండియన్ కెన్ పవర్ విజయపుర జిల్లా కంభాగి, శేగుణసి గ్రామాల్లోనూ, ఐసీటీ సర్వీస్ మేనేజిమెంట్ సొల్యూషన్స్ బెంగళూరు గ్రామీణ జిల్లాలోనూ, బాలాజీ షుగర్స్ సంస్థ విజయనరగ జిల్లా ముద్దేబిహాళ్‌లోనూ, ఎయిరిండియా లిమిటెడ్ బెంగళూరు జిల్లాలోనూ భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. మిగిలిన కంపెనీలు విస్తరణా కార్యక్రమాలపై పెట్టుబడులు పెట్టనున్నాయి.

కాంగ్రెస్ తొలిజాబితాలో
ఏడుగురికి చోటు

- బెంగళూరు గ్రామీణ నుంచి మరోసారి డీకే సురేశ్
- శివమొగ్గ నుంచి గీతా శివరాజ్‌కుమార్

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ శుక్రవారం దేశవ్యాప్తంగా 39 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేయగా రాష్ట్రం నుంచి ఏడుగురికి చోటు దక్కింది. బెంగళూరు గ్రామీణ నుంచి డీకే సురేశ్ మరోసారి పోటీ చేయనున్నారు. కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ ఇప్పటికే రెండుసార్లు గెలుపొందగా మూడోసారి రంగంలోకి దిగుతున్నారు. శివమొగ్గ నుంచి అనూహ్యంగా కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ కుమారుడు శివరాజ్ భార్య గీతా అభ్యర్థి అయ్యారు. గతంలోనూ ఆమె ఇదే స్థానం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఈమె మాజీ ముఖ్యమంత్రి బంగారప్ప కుమార్తె. బిజాపూర్ నుంచి హెచ్‌ఆర్ అలగూర్, హావేరి నుంచి ఆనందస్వామి గడ్డదేవరమఠ్, హాసన్ నుంచి శ్రేయస్ పాటిల్, తుమకూరు నుంచి ముద్దహనుమేగౌడ, మండ్య నుంచి వెంకటరామేగౌడ అలియాస్ స్టార్ చంద్రు పేర్లను ప్రకటించారు. రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీ పంపిన జాబితాలో ఏకంగా 15 స్థానాలకు ఒకరి పేరు సిఫారసు చేశారు. వీటిలో ఏడుగురు ఖరారు కాగా మిగిలిన 8 మంది పేర్లు రెండో జాబితాలో ఉండవచ్చునని తెలుస్తోంది. ఒకరి పేరు సిఫారసు జాబితా ప్రకారం మైసూరు నుంచి లక్ష్మణ్, కోలారు నుంచి మునియప్ప, బెంగళూరు సెంట్రల్ ఎన్‌ఏ హ్యారిస్, చిక్కబళ్లాపుర నుంచి రక్షా రామయ్య, బెంగళూరు దక్షిణ నుంచి సౌమ్యరెడ్డి, చిత్రదుర్గ నుంచి చంద్రప్ప, బీదర్ నుంచి రాజశేఖర్ పాటిల్, కలబురగి నుంచి రాధాకృష్ణ, ఉడుపి -చిక్కమగళూరు నుంచి జయప్రకాశ్ హెగ్డే పేర్లు ఉన్నాయి. జయప్రకాశ్ హెగ్డే త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. అంతకుముందే ఆయన పేరు సిఫారసులో ఉంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1585.43	1,601.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,242	8,202
సామర్థ్యం (టీఎంసీలు)	7.61	23.83

పశుగ్రాసం పంపిణీ



పశుగ్రాసాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్

కంప్లి, మార్చి 8 : విజయనగర జిల్లాలోని కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్ గొరయ్యనహట్టి గ్రామంలో బొమ్మలింగేశ్వర దేవస్థానం వద్ద వున్న ఆవులు, పశువులు ఇతర వాటికి పశుగ్రాసం సేకరించి వివిధ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో లారీలో పశుగ్రాసంను ఆలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనిషికి కష్టం వస్తే మాట్లాడి తన కాష్టాన్ని తీర్చుకుంటారు. కానీ మాట్లాడలేని మూగజీవుల మనసును మనం అర్థం చేసుకుని పశువులకు కావాల్సిన మేత, నీరు సరియైన సమయంలో అందించడమే ధర్మమన్నారు. అందుకు ముందుకొచ్చి వివిధ గ్రామాలలో పశుగ్రాసం సేకరించి పశువులకు మేతను అందిస్తున్నట్లు తెలిపారు.

సాంబారులో పడి బాలుడు మృతి

కంప్లి, మార్చి 8 : సండూరు తాలుకా చోర్నూరు పరిధిలోని హెచ్‌కే హళ్లి గ్రామంలో రెండు సంవత్సరాల వయసు గల సమర్థ్ అనే బాలుడు సాంబారు పాత్రలో పడి మృతిచెందాడు. హెచ్‌కేహళ్లి గ్రామానికి చెందిన మంజునాథ, ఉలిగమ్మలకు లేకలేక ఒక కుమారుడు జన్మించాడు. ఆ చిన్నారి ఇంట్లో వున్న సమయంలో పక్కనే వేడిగా వున్న సాంబారు పాత్రను వుంచారు. దాని పక్కనే అప్పడాల పాత్ర వుండటంతో బాలుడు అప్పడాలను తీసుకునేందుకు వెళ్లి దొర్లి పక్కనే వున్న సాంబారు పాత్రలో పడిపోయాడు. వెంటనే గమనించిన తల్లిదండ్రులు చిన్నారిని చోర్నూరు ఆస్పత్రికి తరలించారు. బాలుడికి ఒళ్లంతా బొబ్బలతో రక్తప్రసరణ జరగక మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు.

చల్లటి మజ్జిగ పంపిణీ



మజ్జిగను అందజేస్తున్న మురగన్, సతీమణి వనజ

బళ్లారి సిటీ, మార్చి8: రాజ్‌కుమార్ రోడ్డులోని గాంధీ నగర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా రహదారి గుండా వెళ్లే ప్రజలకు శుక్రవారం మురగన్ ఆయనసతీమణి వనజ చల్లటి మజ్జిగను అందించారు. సుమారు ఐదు సంవత్సరాలనుండి శివరాత్రి పర్వదినాన ఎండలు ఎక్కువగా ఉండటంతో చల్లటి మజ్జిగ, అల్పాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రవీణ్, విజయ, గురుమూర్తి, రాజు, సునీత తదితరులు రహదారి ప్రయాణికులకు మజ్జిగను అందజేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

కంప్లి, మార్చి 8: ఎమ్మెల్యే జేఎన్‌గణేష్ పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చుకుంటున్నట్లు తెలిపారు. కంప్లి తాలుకా పరిధిలోని వెల్‌కమ్ బోర్డు నుంచి ఎల్‌ఎల్‌సీ కెనాల్ వరకు రోడ్డు అభివృద్ధి పనులు, దేవసముద్రంలో రోడ్డు పనులు, సుగ్గినళ్లి నుంచి దేవలాపురం రోడ్డు పనులు, మైత్రి భవన నిర్మాణ పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. అలాగే ఎంపీ ఎన్నికల అనంతరం కంప్లి తాలుకా ఉత్సవాలు కూడా జరుపుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, లోకేష్, మహబూబ్, రమేష్, మరేగౌడ, అంజినప్ప, మల్లికార్జున, సుగ్గినళ్లి, దేవలాపురం అధ్యక్షులు పాల్గొన్నారు.

వందే శివం శంకరమ్!

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బళ్లారి, విజయ నగరం, కొప్పళ, చిత్రదుర్గం జిల్లాలలోని శివాలయాలు 'హర హర మహాదేవా, శంభోశంకర' అనే భక్తుల శరణు ఘోషలతో మారుమ్రోగాయి. పండుగ సందర్భంగా శుక్రవారం ఉదయమే శివునికి పన్నీరుతో అభిషేకం చేసి, విభూది, బిల్వపత్రి, రుద్రాక్షమాలలతో పూజ చేశారు.

ఎడతెగని సందడి



బళ్లారి తాలుకాలోని పీడీ హళ్లి, హగరి, మోకా తదితర ప్రాంతాల్లో మహాశివరాత్రి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి ఆయా ఆలయాల్లో స్వామివారికి విశేష పూజలు, పంచామృతాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా జాగరణ, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు జరిగాయి

అఖండ భజన



సిరుగుప్పలోని ఆలయాలు ఓం నమః శివాయ నామస్మరణతో మార్మోగాయి. తాలుకాలోని శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో స్వామికి పూజలు నిర్వహించారు.



సిరుగుప్ప పట్టణంలో ఆదోని రోడ్డు మార్గంలో నాగలింగేశ్వరాలయంలో పుష్పాలంకార సేవలు నిర్వహించారు.

కంప్లిలో..



శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన కంప్లి ఈశ్వరాలయం



నమో విరూపాక్ష

హంపి అంటే మొదటగా గుర్తుకువచ్చేది విరూపాక్షేశ్వరుడే. తురుష్కుల దండయాత్రలను ఆయన పందిరూపంలో ఎదుర్కొన్నాడని ఐతిహ్యం.



అమృతేశ్వరాయ నమః

బాలాజీనగర్ శివాలయంలో పూజలందుకుంటున్న అమృతేశ్వరుడు



సోమేశ్వరాయ నమః

హగరి సోమేశ్వరస్వామికి విశేష పూజలు



ముక్తినాథేశ్వరాయ నమః

శివరాత్రి సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ఉపవాసం వుంటూ కంప్లిలో పార్వతీపరమేశ్వరులకు అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం వేళ స్వామివారికి సహస్రనామార్చన, మంగళహారతి, పూలు, పండ్లతో మొక్కులు సమర్పించారు. కంప్లి షుగర్ ఫ్యాక్టరీ, ఎమ్మిగనూరు, కురుగోడు తదితర ప్రాంతాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కల్యాణీ కాళీ

ప్రత్యేకాలంకరణలో కాళికాదేవి

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం



ఎగ్జిబిషన్‌లో ఐదు గ్యారెంటీ పథకాలను పరిశీలిస్తున్న ఏడీసీ తదితరులు

బళ్లారి సిటీ, మార్చి 8: ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నగర ఏడీసీ మహ్మద్ జుబేరా అభిప్రాయపడ్డారు. నగరంలోని సెంట్రల్ బస్టాండ్‌లో సమాచార, ప్రజా సంఘాల తరపున ఐదు హామీ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన మూడు రోజుల ఎగ్జిబిషన్ స్టాల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శక్తియోజన్, గృహలక్ష్మి, గృహజ్యోతి, యువనిధి, అన్నభాగ్య వంటి పథకాలను అమలు చేశామన్నారు. మెటీరియల్ డిస్‌ప్లే ప్రాజెక్టుల గురించి సమాచారాన్ని కలిగి ఉండాలని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అర్హులైన ప్రతి లబ్దిదారునికి గ్యారెంటీ పథకాలు అందజేసేందుకు, ప్రభుత్వ సమాచార పౌరసంబంధాల శాఖ సెంట్రల్ బస్టాండ్‌లో డిస్‌ప్లే స్టాల్‌ను ఏర్పాటుచేసింది. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సమాచారం పొందవచ్చని తెలిపారు. బస్టాండ్‌కు వచ్చే ప్రజలు, ప్రయాణికులతో పాటు జిల్లాలోని ప్రజలందరూ ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి ప్రభుత్వ పథకాల గురించి సమాచారం పొందవచ్చని తెలిపారు. ఆసక్తి గల ప్రజల కోసం స్టాల్ పక్కన సెల్ఫీ పాయింట్‌ను ఉంచారు. ఇదే సందర్భంగా వార్తా పౌరసంబంధాల శాఖ కేంద్ర కార్యాలయం నుంచి ప్రచురించిన జానపద సాహిత్య పుస్తకాలను పంపిణీ చేశారు.

ఈసందర్భంగా కల్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ బళ్లారి డివిజన్ కంట్రోలర్ ఇనాయ్ బాగ్‌బాన్, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ ప్రథమశ్రేణి అసిస్టెంట్ వీసీ గురురాజా, శాఖ సిబ్బంది విజయ్‌కుమార్, హనుమంతప్ప, మల్లేశప్ప, శ్రీధర కావలి, హనుమేశ్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

హొసపేటలో మహిళలకు యోగా శిబిరం



యోగా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

హొసపేట,మార్చి 8: స్త్రీలల్లో హార్మోన్ల అసమతుల్యత వల్ల రుతుక్రమం ఆగిపోవడం, తదనంతర మానసిక మార్పులు సహజమని, ఆ సమయంలో పురుషులు తమ జీవిత భాగస్వామితో సానుభూతితో వ్యవహరించడం వారికి అండగా నిలవడం చాలా ముఖ్యమని డాక్టర్ హేమలత, సుమంగల, తనూజ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన యోగా శిబిరంలో వారు మాట్లాడారు. రుతుక్రమం ఆగిపోయే సమయంలో వచ్చే మానసిక మార్పులు, డిప్రెషన్, ఆందోళలపై అవగాహన పెంచుకుని ఒత్తిడికి లోనుకాకుండా సంయమనం పాటించాలని సూచించారు. బహిష్టు సమయంలో వచ్చే తాత్కాలిక నొప్పుల గురించి ఆందోళన చెందకుండా సంప్రదించి పరిష్కారం పొందాలన్నారు. ఆరోగ్యం కోసం నడక, యోగా, వ్యాయామం, ఒత్తిడి లేకుండా సంతోషంగా ఉండటం నేర్చుకుని మంచి జీవనశైలిని అనుసరించాలన్నారు. ఈసందర్భంగా పతంజలి యోగా కమిటీ మంగళమ్మ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుంకమ్మ, ప్రకాశ్ , ఫ్రీడమ్ పార్కు ఇన్‌చార్జిలు అనంతజోషి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

వైభవంగా అమృత మల్లికార్జునస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

హోసూరు(సిఫ్‌కాట్) మార్చి 8: హోసూరు సమీపంలోని ఎస్ ముదుగానపల్లి గ్రామంలో వెలసిన సుమారు వెయ్యి సంవత్సరాల నాటి అమృత మల్లికార్జునస్వామి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ధ్వజారోహణంతో పాటు గణపతిపూజ, కలశ స్థాపన, అభిషేకం, గిరిజా కల్యాణం జరిగింది. శుక్రవారం ఉదయం విశేషపూజలు అనంతరం రథోత్సవం నిర్వహించారు. భక్తులుపెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఏటా రథాన్ని లాగుతూ ఊరేగింపుగా స్వామి వారిని తీసుకుని గ్రామం చుట్టూ తిరిగి వస్తారు. బెంగళూరు నుంచి కూడా భక్తులు పాల్గొన్నారు.

మహంకాళి ఎద్దు మృతి

హోసూరు, మార్చి 8: కృష్ణగిరి పశ్చిమ జిల్లా హోసూరు, శూలగిరి, డెంకణీకోట వంటి అనేక గ్రామాలలో ప్రదర్శనల్లో పాల్గొన్న హోసూరు కుముదేపల్లి రైతు ప్రకాశ్ ఎద్దు మృతి చెందింది. దానిని ప్రకాష్ మహంకాళి పేరుతో పెంచుకుంటున్నాడు. అకస్మాత్తుగా శుక్రవారం ఎద్దుకు అనారోగ్యం పాలు కావడంతో హోసూరు పశువైద్యశాలకు తీసుకొచ్చి చికిత్స అందించారు. చికిత్స ఫలించక ఎద్దు మృతి చెందింది. దీంతో ఎద్దు యజమాని ప్రకాశ్ ఒక్కసారిగా కుప్పకులాడు. అనంతరం ఎద్దు కళేబరాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి ఊరేగింపు అనంతరం సొంత స్థలంలో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్థులందరూ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై మాక్‌డ్రిల్

హోసూరు, మార్చి 8: హోసూరు రవాణాశాఖ వర్క్‌షాప్‌లో అగ్ని ప్రమాదాల నియంత్రణకు సంబంధించి మాక్‌డ్రిల్ నిర్వహించారు. కృష్ణగిరి జిల్లా అధికారి వేలు ఆదేశాలతో హోసూరు కార్పొరేషన్ పరిధిలో ప్రజలను జాగృత పరిచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హోసూరు స్టేషన్ ఆఫీసర్ నాగవిజయన్, అతని బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం హోసూరు ప్రభుత్వ రవాణా సంస్థ వర్క్‌షాప్‌లో సుమారు 150 మంది బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొని మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంల్లో అర్బన్ వర్క్‌షాప్ మేనేజర్ శ్రీనివాసన్, హోసూరు మేనేజర్ ఇళంగో, డ్రైవర్, కండక్టర్, సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

హోసూరు (మత్తిగిరి) మార్చి 8: బడికి వెళ్లే వయస్సుల్లో పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలనే లక్ష్యంతో హోసూరు యూనియన్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తరచూ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాల గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. శుక్రవారం ర్యాలీలో హోసూరు జిల్లా ప్రాథమిక విద్యాశాఖాధికారి మునిరాజ్ పాల్గొని అవగాహన కల్పించారు. మున్సిపల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొండురాయ్ నేతృత్వంలో కార్యక్రమం సాగింది. పాఠశాల నిర్వహణా కమిటీ సభ్యులు కృష్ణవేణి రాజు, పార్వతి నాగరాజ్‌తోపాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాల అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సిరిధాన్య పంటలకు మరింత ప్రోత్సాహం: మంత్రి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి భోసరాజు

రాయచూరు, మార్చి 8: రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రూ.25కోట్లతో నిర్మిస్తున్న సిరిధాన్యాల ఉద్యానవనం రైతులకు మరింత ప్రోత్సహకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయ స్వామి అన్నారు. ఉద్యానవన నిర్మాణ పనులకు శుక్రవారం రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్ఎస్ భోసరాజు ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి వర్చువల్‌గా మాట్లాడిన వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయ స్వామి, రైతుల సిరిధాన్యాల పంట ఉత్పత్తులు పరిశోధన, ఇతరత్రా అవసరాల కోసం నిర్మించే ఉద్యానవనం మరింత ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాట్లాడిన రాష్ట్ర చిన్ననీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు, రైతు ప్రయోజనాలు కాపాడేందుకు తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. రైతులను అన్నివిధాలా ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక కొత్త పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు.

రాయచూరులో భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి

రాయచూరు, మార్చి 8 : మహాశివారాత్రి పర్వదినాన్ని నగరంలో భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివాలయాల్లో భక్తులు తెల్లవారు జామునుంచే మహాశివుడి దర్శనం కోసం బారులు తీరారు. పలు ఆలయాల్లో మహాశివారాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. నందీశ్వర ఆలయం, చంద్రమౌళీశ్వర ఆలయం తదితర ఆలయాల్లో వేకువజామున నుంచి మధ్యాహ్నాం వరకు తిరిగి సాయంత్రం నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనం చేసుకున్నారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక భజనలు చేస్తూ జాగరణ చేశారు.



ప్రత్యేక అలంకరణలో చంద్రమౌళేశ్వర స్వామి

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

యూరీ గగారిన్ (జయంతి)



ప్రముఖ సోవియట్ వ్యోమగామి యూరీ గగారిన్ 1934 మార్చి 9న జన్మించారు. రష్యన్లు ఆయనను సోవియట్ హీరోగా పరిగణిస్తారు. పూర్తి పేరు యూరీ అలెక్సెయెవిచ్ గగారిన్. 1961 ఏప్రిల్ 12న అంతరిక్షంలోకి వెళ్లిన మొట్టమొదటి మానవుడిగా చరిత్ర సృష్టించారు. భూమి చుట్టూ కక్ష్యలో పరిభ్రమించిన వాడుగాను రికార్డు నమోదు చేశారు. అంతరిక్షంలోకి ప్రయాణించినందుకు ప్రపంచంలోని అనేక దేశాలు, పతకాలు, బహుమతులతో గౌరవించాయి. 1968 మార్చి 27న కన్నుమూశారు.

జాకీర్ హుస్సేన్ (పుట్టినరోజు)



తబలా వాదనలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన 'పద్మభూషణ్' పురస్కార గ్రహీత ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ 1951 మార్చి 9న ముంబైలో జన్మించారు. తండ్రి ఖురేషి అల్లారఖా ఖాన్ వద్దనే తబలా వాద్యంలో తర్ఫీదు పొంది రాణించారు. స్వరకర్తగా, సంగీత దర్శకుడిగా పేరొందారు. హిందూస్థానీ శాస్త్రీయ సంగీతంలో గాయనంలోనూ, వాద్యంలోనూ పండిట్ రవిశంకర్, భీమ్‌సేన్‌జోషి వంటి ప్రముఖులతో కలసి కచేరీలు ప్రదర్శించారు. గ్రామీ అవార్డు, పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ తదితర పురస్కారాలు అందుకున్నారు.

శశి థరూర్ (పుట్టినరోజు)



కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌కు చెందిన రాజకీయ నేత శశిథరూర్ 1956 మార్చి 9న లండన్‌లో జన్మించారు. 2009 నుంచి తిరువనంతపురం నుంచి లోక్‌సభ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. యునైటెడ్ నేషన్స్‌లో పలు హోదాలలో కొనసాగారు. కేంద్ర విదేశీ వ్యవహారాలు, మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా వ్యవహరించారు. అంతేకాక రచయితగా చరిత్ర, సంస్కృతి, రాజకీయం, సామాజిక, తదితర అంశాలపై 19 ప్రముఖ పుస్తకాలు రాశారు. ప్రవాసి భారతీయ సమ్మాన్, రజికా కృపాలాని యంగ్ జర్నలిస్టు అవార్డ్ అండర్ 30 తదితర పురస్కారాలు పొందారు.

ఆర్‌పీ పట్నాయక్ (పుట్టినరోజు)



ఆర్‌పీగా చిరపరిచితులైన రవీంద్ర ప్రసాద్ పట్నాయక్ 1970 మార్చి 9న మన్యం జిల్లా పార్వతీపురం ప్రాంతంలో జన్మించారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో 75కు పైగా సినిమాలకు సంగీతం అందించారు. 'నీ కోసం' సినిమాతో అరంగేట్రం చేశారు. నువ్వు-నేను, సంతోషం, ఎక్స్‌క్యూజ్‌మీ సినిమాలకు వరుసగా ఫిల్మ్‌ఫేర్ అందుకున్నారు. మూడు నంది, ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు పొందారు. 2002 జూలై 20న విశాఖపట్నం బీచ్‌లో ఏర్పాటు చేసిన సంగీత విభావరికి 6 లక్షల మందికిపైగా పాల్గొనడం ప్రత్యేకం. స్వరకర్తగా, గాయకుడిగా, సంగీత దర్శకుడిగా రాణించారు. అంతేకాక కొన్నింటికి దర్శకత్వం వహించి, నటించారు. 2016లో 'మనలో ఒకడు'కు థర్డ్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్‌గా గుర్తింపు పొందింది. నండూరి సుబ్బారావు రచించిన 'ఎంకి పాటలు'ను జానపదాల ఆల్బమ్‌గా ఆర్‌పీ విడుదల చేశారు.

దర్శీల్ (పుట్టినరోజు)



దర్శీల్ సఫారి 1997 మార్చి 9న ముంబైలో జన్మించారు. పదో యేటనే సినీరంగంలో అడుగు పెట్టి పేరొందారు. 2007లో అమీర్‌ఖాన్ దర్శకత్వంలో రూపొందిన 'తారే జమీన్ పర్' సినిమాకు ఉత్తమ నటుడి పురస్కారం పొందారు. బుల్లితెరపైనా రాణించి సత్తా చాటుకున్నారు. జీ సినీ అవార్డ్, స్టార్ స్క్రీన్ అవార్డు, శాంతారాం అవార్డ్ తదితర పురస్కారాలు పొందారు.

శివనామంతో మార్మోగిన ఆలయాలు



చేళూరులో విశేష అలంకరణలో కాశీ విశ్వేశ్వరుడు



వాసవికల్యాణమండపంలో ఈశ్వరుడికి అలంకరణ



చింతామణిలో తపతేశ్వరస్వామికి అలంకరణ



హరిహరేశ్వస్వామి ఆలయంలో భక్తుల క్షీరాభిషేకం



విజయపురలో ఓంకారేశ్వరస్వామికి అలంకరణ

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన అన్ని శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ఇందులో భాగంగా మహతోభార మహాలింగేశ్వర దేవస్థానంలో 4వ వార్షిక మహాశివరాత్రి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. దేవస్థానం ఛైర్మన్ బీ గుణరంజన్ శెట్టి ఈ వేడుకలకు సారథ్యం వహించారు. న్యూ తిప్ప సంద్రలోని వీరాంజనేయస్వామి ఆలయం నుండి మహతోభార మహాలింగేశ్వర దేవుడి లింగమూర్తిని 108 కుంభ కళసాలతో భారీ ఊరేగింపుగా గురువారం తీసుకొచ్చి శిశుగృహ ఆటమైదానానికి తెచ్చిన సంగతి విదితమే. శుక్రవారం మైదానంలో శివలింగాన్ని స్థాపించి ప్రాణప్రతిష్ఠ, శత రుద్రాభిషేకం, పూర్ణాహుతి, మహామంగళహారతి, రుద్రా పారాయణ పూజాది కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం నుంచే చుట్టుపక్కల ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వేడుకలకు భక్తులు పోటెత్తారు.

బొమ్మనహళ్ళిలో...

బొమ్మనహళ్ళి: మహాశివరాత్రిని పురస్కరిం చుకుని స్థానిక శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మా రుమోగాయి. అరికెరెలోని శాంతిధామలో వెలసిన మంజు నాథస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి క్షీరాభిషేకం, లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచా మృతాభిషేకం, విశేష అలంకరణ అనంతరం మహా మంగ ళారతి ఇచ్చారు. మూలవిరాట్టుకు భక్తులచే స్వయంగా క్షీరా భిషేకానికి అవకాశం కల్పించారు. సాయంత్రం కూడా మహా భిషేక పూజ, రుద్రాభిషేకం, జప తపాదులు నిర్వహించారు. రోజంతా అభిషేకం సాగింది. ధ్యానమందిరంలో నాలుగు యామ పూజలు కొనసాగాయి. అభిషేకం పాలను ప్రసాదంగా పంపిణీ చేశారు. కాగా సాయిబాబా ఆల యంలోనూ భజనలు నిర్వహించారు. జాగరణ నేపథ్యంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. వేలాదిమంది భక్తులు సందర్శించారు. ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ట్రస్టు పదాధికారులు తాతయ్యగుప్త, మనోహర్ గుప్త, కృష్ణయ్యశెట్టి, వెంకటేశ్ గుప్త, సత్యనారాయణ గుప్త, సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సుద్దగుంటపాళ్యలో...

కాగా సుద్దగుంటపాళ్యలో మహామునీశ్వర స్వామి ఆల యంలోనూ శివరాత్రి వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఇక్కడి ఉత్సవాల్లో మంత్రి రామలింగారెడ్డి, స్థానిక కాంగ్రెస్ సీనియర్ నేత, దాత కవితా శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

బాగేపల్లిలో...

బెంగళూరు: పట్టణంలోని పురాణ ప్రసిద్ధమైన జడల భైరవేశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం స్వామివారికి పంచామృత అభిషేకం, శతరుద్రాభిషేకం, సహస్ర నారికేళ అభిషేకం, హోమం నిర్వహించారు. సాయంత్రం నుంచి అఖండ భజనా కార్యక్రమం సాగింది. చిత్రావతి నది డ్యామ్ సమీపానగల ఆలయంలో సహస్ర బిల్వార్చన, మాఘతీర్థస్నాన, రుద్రపారాయణ, అఖండ శివపంచాక్షరి జపం, సామూహిక భజన, శివపారాయణ విశేష కార్యక్రమం సాగింది. పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా శివాలయాలలో విశేషపూజలు కొనసాగాయి. పాతపాళ్యలోని హిరణ్ణయ్య దేవస్థానం, గూళూరులోని వీరభద్ర దేవాలయం, మానవధర్మ పీఠ శివలింగం, పరగోడులోని పంచలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చేళూరులో...

చేళూరు: మహాశివరాత్రిని పురస్కరించుకుని చేళూరు పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా శివాలయాలలో విశేష పూజలు కొనసాగాయి. పట్టణంలోని మెయిన్‌రోడ్డుకు అనుబంధంగా ఉన్న పురాతన కాశీ విశ్వేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. కాగా శనివారం ఉదయం 10 గంటలకు రథోత్సవం, ఆదివారం రాత్రి తెప్పోత్సవం జరగనుంది. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి ఎస్ రామకృష్ణారెడ్డి, కేఎస్ మధుసూధనరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు కొనసాగాయి. భక్తులు పెద సంఖ్యలో విచ్చేశారు. కాగా పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు నాలుగు యామపూజలు కొనసాగనున్నాయి.

చింతామణిలో...

చింతామణి: మహాశివరాత్రిని పురస్కరించుకుని చింతామణి పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా పలు శివా లయాలలో శుక్రవారం విశేషపూజలు, హోమాలు, అలం కరణలు నిర్వహించారు. ఆజాద్‌చౌక్‌లోని హరిహరేశ్వర స్వామి దేవాలయంలో ఉమామహేశ్వరస్వామికి క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, మధ్యాహ్నం మహామంగళారతి అనంతరం తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. గిరిజా కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. సాయంత్రం దక్షయజ్ఞం, రాత్రి రుద్రాభిషేకం కొనసాగింది. మురగమల్లా కొండపై గల ముక్తీశ్వర దేవాలయంలోనూ, అనూరు సోమేశ్వరస్వామి ఆలయంలోనూ, ఎన్‌ఆర్ లే అవుట్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలోనూ విశేషపూజలు కొనసాగాయి. అంబాజిదుర్గ గుట్టపై గల మహా కైలాసగిరి క్షేత్రంపై గంగాధరేశ్వర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శతరుద్ర హోమ గిరిజా కల్యాణోత్సవం జరిగింది. వల్లభ గణపతి, జగదాంబ సమేత చతుర్ముఖ లింగేశ్వరస్వామి సన్నిధిలో అభిషేకం, అర్చన, మహామంగళారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. పట్టణంలోని ఎంజీ రోడ్డులోగల తపతేశ్వరస్వామి ఆలయంలోనూ ఆలయ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. వివిధ భజనమండళులచే భజనలు ఉత్సాహంగా జరిగాయి. నాగనాథేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పుష్పాలంకరణ ఆకట్టుకుంది. తాలూకాలోని కైవారలోని భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఇతర పూజలు జరిగాయి. పార్వతీ అమ్మవారికి లలితాసహస్రనామార్చన నిర్వహించారు. నాద సుధారసవేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి.

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట: మహాశివరాత్రిని పురస్కరించుకుని పట్టణంతో పాటు తాలూకా వ్యాప్తంగా పలు ఆలయాలు భక్తుల శివనామస్మరణతో మారుమోగాయి. వీరాపుర సమీపంలోని గవిగుట్టలో కొలువైన గవిగంగాధరేశ్వరస్వామికి శుక్రవారం విశేషపూజలు కొనసాగాయి. భక్తుల కొంగుబంగారంగా ఇక్కడ స్వామి పూజలందుకుంటున్నారు. వేకువజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం కూడా విశేషపూజలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

విజయపురలో...

విజయపుర: దేవనహళ్ళి తాలూకా విజయపురలో మహాశివరాత్రికి పలు ఆలయాల్లో విశేషపూజలు సాగాయి. ప్రత్యేకించి 101 శివలింగాలు కలిగిన ఓంకారేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించగా స్వామివారికి విశేష అభిషేకం, పుష్పాలంకరణ నిర్వహించారు. అఖండ శివనామస్మరణ భజన కొనసాగింది. గాంధీచౌక్‌లోని బలమురి గణపతి ఆలయం, నగరేశ్వరస్వామి, సంగమేశ్వర స్వామి ఇతర ఆలయాల్లోనూ ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



శిడ్లఘట్టలో గవిగంగాధరేశ్వరుడికి అలంకరణ



జడల భైరవేశ్వరుడికి అలంకరణ



మంజునాథస్వామికి క్షీరాభిషేకంలో పాల్గొన్న సేవాదళ్ సభ్యులు తదితరులు



వేడుకల ప్రారంభంలో ప్రముఖులు

పోలింగ్ శాతం పెంచేదిశగా చర్యలు

- నోటిఫికేషన్ రాగానే రాష్ట్రమంతటా ఆంక్షలు
- ఓటరు స్లిప్‌లలో బూత్ క్యూఆర్ కోడ్
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మనోజ్‌కుమార్ మీనా



మనోజ్‌కుమార్ మీనా

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ శాతాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, ఆ మేరకు అవగాహన కల్పిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్) మనోజ్‌కుమార్ మీనా పేర్కొన్నారు. మరికొన్ని రోజుల్లోనే లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రానున్న తరుణంలో శుక్ర వారం ఆయన మీడియాతో మాట్లాడారు. నోటిఫికేషన్ రాగానే రాష్ట్రమంతటా కోడ్ అమలులోకి వస్తుందని, అందుకు తగిన కసరత్తు సిద్ధం చేశామన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 68 శాతం పోలింగ్ నమోదయిందని, రానున్న ఎన్నికల్లో మరో నాలుగైదుశాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేకంగా నగర ప్రాంతాల్లో ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించేలా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. అందుకు వినూత్నమైన కార్యక్రమాలను పరిచయం చేస్తామన్నారు. ఎన్నికల్లో అక్రమాలను అరికట్టేందుకు ప్రజల భాగస్వామ్యాన్ని కమిషన్ ఆకాంక్షిస్తోందన్నారు. ఇకపై ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాన్ని వెతుక్కోవాల్సిన పని లేదని, చీటీలలోనే క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తామన్నారు. ఈ పద్ధతిని తొలిసారిగా ప్రవేశపెడుతున్నామన్నారు. ప్రత్యేకించి బెంగళూరులో పోలింగ్ శాతం తగ్గేందుకు కేంద్రాలను గుర్తించే ప్రక్రియ కూడా ఉందన్నారు. అందుకే బెంగళూరు నగరంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 43 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో క్యూఆర్ కోడ్ వ్యవస్థను తీసుకొస్తున్నామన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ప్రయోగాత్మకంగా పరిచయం చేశామని, లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి అమలు చేస్తున్నామన్నారు. బెంగళూరులో 28 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, మిగిలినవి ప్రధాన నగరాలలో ఎంపిక చేశామన్నారు. ఈవీఎంలపై వస్తున్న విమర్శలు ముగిసిన అధ్యాయమన్నారు. సాంకేతికంగా అక్రమాలను నిరూపించలేదన్నారు. పారదర్శకంగా ఈవీఎంల ద్వారా ఎన్నికలు జరుగుతున్నట్టు రుజువైందన్నారు. ఈవీఎం వేర్‌హౌస్ నుంచి పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చే ప్రతిదశలోనూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉంటారన్నారు. వారి సమక్షంలోనే ప్రాథమిక దశలో పరిశీలనలు సాగుతాయన్నారు. ఏ పోలింగ్ యంత్రం ఏ బూత్‌కు వెళ్లిందనే సమాచారం ఉంటుందన్నారు. ఎన్నికలకు అవసరమైన ఈవీఎం, వీవీప్యాట్‌లు సిద్ధమయ్యాయన్నారు. అదనంగా 125 శాతం ఈవీఎంలను, 135 శాతం వీవీప్యాట్‌లను సిద్ధం చేశామన్నారు. తుది ఓటర్ల జాబితా జనవరి 22న ప్రకటించామన్నారు. అప్‌డేట్ ప్రక్రియ నిరంతరంగా సాగుతుంటుందన్నారు. నామినేషన్లు దాఖలు చేసే పదిరోజుల ముందుదాకా ఓటరు నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. మూడేళ్లుగా ఒకే జిల్లా లేదా సొంత జిల్లాలో పనిచేసిన అధికారులను బదిలీ చేశామన్నారు. ఎన్నికల నిబంధనల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో 5.40 కోట్ల మంది ఓటర్లు ఉన్నారన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి నోటిఫికేషన్ ప్రకటించగానే నిబంధనలు అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో 2014లో ఒకే విడతలో ఎన్నికలు జరిగాయని, 2019లో రెండు విడతలుగా సాగాయని గుర్తు చేశారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగితే ప్రజలు కమిషన్‌దృష్టికి తీసుకురావాలని, ఇందుకోసం సి విజిల్ అనే యాప్ ఉందన్నారు. అక్రమాలకు సంబంధించి ఫొటోలు, వీడియోలను అప్‌లోడ్ చేయవచ్చునన్నారు. సోషల్‌మీడియాలో ప్రచారం పైనా నిఘా ఉంటుందన్నారు.

శివబాలయోగి ఆశ్రమంలో భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు జేపీ నగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయాన్ని విద్యుద్దీపాలతోనూ, రకరకాల పుష్పాలు తోరణాలతో అందంగా అలంకరించారు. ఆలయ ట్రస్టుచైర్మన్ రాంబాబు స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా చూశారు. ఆలయంలో యామ పూజలు మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 6 గంటలకు, రాత్రి 9 గంటలకు జరుగ్గా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటలకు వాసవి మహిళామండలి బృందంచే భక్తిగీతాలాపన జరిగింది. అనంతరం చెక్క భజనామండలిచే భక్తిగీతాలాపన, ఎస్ఎల్‌విబిఎం భజన మండలిచే భక్తిగీతాలు, స్వర మాధుర్య బృందంచే భరతనాట్యం, అనంతరం శ్వేతశ్రీనివాస్‌చే శక్తి యక్షగాన ప్రదర్శన జరిగాయి. ఆపై రత్నమాల పురందర్ బృందంచే భక్తిగీతాలాపన జరిగింది. తదుపరి విశ్వభారతి నట్యాశాల విద్యార్థులచే భరతనాట్యరూపకం కనుల పండువగా సాగింది. ఉదయం నుండే భక్తులు ఈ ఆశ్రమంలోని శివలింగానికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. నగరం నలుమూలల నుంచి భక్తులు ఈవేడుకల్లో పాల్గొని పరమశివుని అనుగ్రహాన్ని పొందారని రాంబాబు తెలిపారు.

రామేశ్వరం కెఫె పునఃప్రారంభం



కెఫె ప్రారంభంలో మాజీ మంత్రి అరవింద లింబావళి తదితరులు

మహదేవపుర, మార్చి 8: స్థానిక కుందలహళ్ళిలో ఇటీవల బాంబు పేలుళ్ల ఘటనతో కలకలం రేకెత్తిన రామేశ్వరం కెఫెను మహాశివరాత్రి పర్వదినాన శుక్రవారం సాయంత్రం పునఃప్రారంభించారు. మాజీ మంత్రి అరవింద లింబావళి, ఎమ్మెల్యే మంజుళా లింబావళి, హోటల్ యాజమానుల సంఘం అధ్యక్షుడు బీసీ రావ్, రామేశ్వరం హోటల్ యజమాని రాఘవేంద్రరావ్, దివ్యరావ్‌లు పోలీసు భద్రత నడుమ ప్రారంభించారు. అనంతరం మాజీ మంత్రి అరవింద లింబావళి మాట్లాడుతూ శాంతికి చిహ్నంగా ఉన్న కారణంగానే బెంగళూరు ఈ స్థాయికి అభివృద్ధి చెందిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇటీవల బాంబు పేలుళ్ల చోటు చేసుకున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టిందని త్వరలోనే నిందితులకు కఠిన శిక్ష పడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాఘవేంద్రరావ్ మాట్లాడుతూ హోటల్‌లో పనిచేసేవారంతా తమకు అండగా నిలిచి యథా ప్రకారం పనుల్లో చేరారన్నారు. గాయపడినవారు కోలుకుంటున్నారన్నారు. పోలీసులు, ఎన్ఐఏ దర్యాప్తుకు తమవంతు పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. యథా ప్రకారం హోటల్ వ్యాపారం కొనసాగిమని ప్రజలు సహకరించాలన్నారు. త్వరలోనే సింగపూర్, దుబాయ్, అమెరికాలలో శాఖలు ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాలపై ఆడియో, వీడియోలు సిద్ధం

- 10న సీఎం ఆవిష్కరణ

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న శక్తి, అన్నభాగ్య, గృహజ్యోతి, గృహలక్ష్మి, యువనిధి గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళనున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఐదు గ్యారెంటీలే ప్రధాన అస్త్రాలు కానున్నాయి. ఇందులో భాగంగా గ్యారంటీ పథకాలపై సుకృతి చిత్రాలయ రూపొందించిన ఆడియో, వీడియోలను ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ నెల 10న సాయంత్రం విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని గ్యారెంటీ పథకాల పర్యవేక్షణా కమిటీ అధ్యక్షుడు మాజీ మంత్రి హెచ్‌ఎం రేవణ్ణ నగరంలో శుక్రవారం మీడియాకు చెప్పారు. ఈ ఆడియో వీడియోలకు ప్రముఖ దర్శకుడు, నటుడు డాక్టర్ ఎస్ నారాయణ సంగీత దర్శకత్వం వహించారన్నారు. సమస్యల సుడిగుండంలో ఉన్న సామాన్య, నిరుపేదలకు గ్యారంటీలతో బ్రతుకుకు తమ ప్రభుత్వం భరోసా ఇస్తోందన్నారు. గ్యారంటీల ద్వారా రాష్ట్రంలో ఏకంగా నాలుగున్నరకోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని దేశంలో ఇలాంటి పథకాలు మరెక్కడా లేవన్నారు. కాంగ్రెస్ సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం కూడా గ్యారెంటీ పథకాలను అమలు చేస్తోందని దేశ వ్యాప్తంగా ఇవి అమలు కావాలన్నది తమ లక్ష్యమని ఆయన తెలిపారు.

బాధలు చాలా ఉన్నాయి.. ఎన్నికల తర్వాత చెబుతా : సీటీ రవి

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మనస్సులో చాలా బాధ ఉంది, దేశ ప్రయోజనాల కోసం అన్నీ గరళంలా కంఠంలో దాచుకున్నా, లోక్‌సభ ఎన్నికల అనంతరం అన్నింటినీ ప్రజల ముందు ఉంచుతానని బీజేపీ సీనియర్ నేత సీటీ రవి పేర్కొన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో తనను ఓడించేందుకు సొంత పార్టీలోనే కొన్ని శక్తులు చురుగ్గా పనిచేశాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. చిక్కమగళూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహాశివుడు విషాన్ని మింగి కంఠంలో ఉంచుకున్న చందాన తాను కూడా వేదనను దాచుకున్నానని అయితే ఎక్కువ రోజులు దాచుకోలేనని సమయం వచ్చినప్పుడు బయటపెడతానని ప్రకటించారు. తనకు వెన్నుపోట్లు పొడిచిన వారి పేర్లను బహిర్గత పరిచేందుకు ఆయన అంగీకరించలేదు. కాగా ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ దేశ ప్రధాని కావాలన్నదే తమ తక్షణ లక్ష్యమని ఎన్నికల అనంతరం అన్ని విషయాలను పూసగుచ్చినట్లు చెబుతానని రవి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగే ఆలోచన లేదని టికెట్ల విషయంలో అధిష్ఠానం నిర్ణయమే అంతిమమన్నారు.

పలు శివాలయాల్లో రక్షారామయ్య పూజలు



అర్చకుల ఆశీర్వాదం అందుకుంటున్న రక్షారామయ్య

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఎంఎస్ రక్షారామయ్య మహాశివరాత్రి సందర్భంగా చిక్కబళ్ళాపుర, బెంగళూరు గ్రామీణ జిల్లాల్లోని పలు శివాలయాలను దర్శించి పూజలు జరిపారు. బెంగళూరు నగరంలోని మత్తికెరెలో గల ఈశ్వర దేవాలయంలో ఉదయమే పూజలు చేసిన ఆయన చిక్కబళ్ళాపురలోని చారిత్రాత్మక భోగ నందీశ్వర దేవాలయాన్ని దర్శించారు. ఆపై దేవనహళ్ళి బొమ్మవారలోని నంజుండేశ్వర ఆలయం, గౌరీ బిదనూరులోని ఈశ్వర ఆలయం, నెలమంగల తాలుకాలోని మదురె శివారున గల ఈశ్వర ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహాశివరాత్రి వేడుకలు ఒకే రోజు రావడం విశేషమని, మహాశివుడి దయతో రాష్ట్రంలో శాంతి సామరస్యాలు వెల్లివిరియాలని అభివృద్ధి కొత్తపుంతలు తొక్కాలని ఆయన ఆకాంక్షించారు.

బీజేపీ ఎంపీ ప్రతాప్‌సింహాపై మీడియా సమావేశాలు వద్దు

- కాంగ్రెస్ నాయకుడికి హైకోర్టు ఆంక్షలు

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మైసూరు బీజేపీ ఎంపీ ప్రతాప్‌సింహకు వ్యతిరేకంగా ప్రెస్‌మీట్‌లు పెట్టరాదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎం లక్ష్మణ్‌కు హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల తరచూ ఎంపీపై కాంగ్రెస్ తరపున లక్ష్మణ్ పలు వ్యాఖ్యలు చేసేవారు. ఎంపీ హైకోర్టును ఆశ్రయించడంతో గురువారం ఆంక్షలు విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. విచారణ వేళ ధర్మాసనం న్యాయమూర్తి ఆర్ నటరాజ్ పలు వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రతి పౌరుడికి వాక్ స్వాతంత్ర్యం ఉందని అయితే ఆరోపణలు చేసినప్పుడు రుజువు చేయాల్సిన బాధ్యతను మరవరాదన్నారు. ఎన్నికలవేళ లక్ష్మణ్‌కు షాక్ ఇచ్చినట్టయ్యింది.

చాకొలెట్ అనుకుని మాత్రలు తిన్న చిన్నారి మృతి

బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రంగురంగులు ఉన్నాయని నాలుగేళ్ల చిన్నారి హృత్విక్ పదిమాత్రలు తినడంతో ఆరోగ్యం వికటించి మృతి చెందాడు. చిత్రదుర్గ జిల్లా కడబనకట్టె గ్రామానికి చెందిన తిప్పేస్వామి, అంజనమ్మ దంపతుల కుమారుడు హృత్విక్ మృతి చెందినవాడు. తండ్రికి అనారోగ్యంతో మాత్రలు తీసుకొచ్చి ఇంట్లో పెట్టారు. గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో చాకొలెట్‌గా భావించి బాలుడు తిన్నాడు. కాసేపటికే తల్లిదండ్రులు మాత్రలు తిన్న విషయాన్ని గుర్తించారు. చిత్రదుర్గ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్సలు జరిపి అనంతరం బెంగళూరు విక్టోరియాకు తీసుకొచ్చారు. చికిత్సలు ఫలించక బాలుడు శుక్రవారం మృతి చెందాడు. తురవనూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. స్థానికంగా ఈ ఘటన కలచివేసింది. గ్రామస్థులు స్పందిస్తూ మాత్రలు, ఇతర మందులను పిల్లలకు అందుబాటులో ఉంచరాదని, ఒకవేళ ఉంచాల్సి వస్తే వాటి పట్ల అవగాహన కల్పించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. మరో ఇంట్లో ఇటువంటి విషాదం నెలకొనకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని తీర్మానించారు.